క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నాగిరెడ్డితో నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి శనివారం తిరుమలకు వెళ్తూ కోవూరు జాతీయ రహదారిలోని నెల్లూరు గ్రాండ్ వద్ద కొద్దిసేపు సేదతీరారు. ఈ సందర్భంగా వారిని డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎం.శ్రీనివాసులురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ ఉన్నారు.

క్రీస్తుగాన జయంతి నేడు

నెల్లూరు(బృందావనం) : బాప్టిస్టు చర్చి డౌనీ హాల్ ఆధ్వర్యంలో 'క్రీస్తుగాన జయంతి' అనే సంగీత రూపకాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సంగీత రూపకంలో క్రీస్తు జనన సందేశాన్ని వివరించే గీతాలు, సందేశాలు ఉంటాయని వివరించారు. ఈ ప్రత్యేక సంగీత ఆరాధనలో సంఘ కాపరి రెవ. కె.శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేస్తారని తెలిపారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించండి

• కమిషనర్ వికాస్‌మర్మత్



నెల్లూరు(బారకాసు) : ఓటరు జాబితాకు సంబంధించి అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులందరినీ జాబితాలో చేర్చాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ ఫారమ్‌లను పరిశీలించి నేటి సాయంత్రంలోపు జాబితాను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్వోలు దేవీకుమారి, ధనుంజయరెడ్డి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుల తనిఖీ

నగరపాలక సంస్థ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, వెంగళరావునగర్, మూలాపేట–1, ప్రగతినగర్ వార్డు సచివాలయాల పరిధిలో స్పందన ఫిర్యాదులను కమిషనర్ వికాస్‌మర్మత్ తనిఖీ చేశారు. అలాగే సచివాలయాల్లోని హాజరు, స్పందన రిజిష్టర్లను, నోటీసు బోర్డుతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ కార్యదర్శులను ఆదేశించారు.

శ్మశానవాటిక పరిశీలన

30వ డివిజన్ కొత్తూరు, వైఎస్సార్ నగర్ ప్రాంతంలో ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి స్థానికులు అభ్యర్థించగా కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. సీపీ దేవీకుమారి, ఏసీపీ వేణు, రూరల్ తహసీల్దార్ నాయక్, సర్వేయర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రంగనాథుని సేవలో..

నెల్లూరు(బృందావనం) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామిని దేవదాయ, ధర్మాదయశాఖ గౌరవ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ శనివారం దర్శించుకున్నారు. ఆయన వెంట బ్రాహ్మణసంఘ నేతలు ముప్వ ప్రసాద్, పారా శ్రీధర్‌శర్మ, రాజేష్, జిల్లా దేవదయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న నెల్లూరు సెంట్రల్ కోర్ చర్చిలో సెమీ క్రిస్మస్ సందర్భంగా శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్ద తలారి బాలసుధాకర్, కాపర్ల కుమార్, నిర్మలజ్యోతి, లూథర్ శామ్యూల్, విజయ్‌ప్రసాద్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రిస్మస్ సంబరాలు



నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో క్రిస్మస్ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు కేక్ కట్ చేశారు. అనంతరం చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

• విశేషంగా తరలివచ్చిన భక్తజనం

పొదలకూరు : పట్టణంలోని వివిధ దేవస్థానాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వారదర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ధనుర్మాస పూజలు, 8 గంటలకు స్నపన తిరుమంజనం, స్వామి, అమ్మవార్ల నగర ఊరేగింపు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి కల్యాణం జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ పెండ్యాల రమణయ్యనాయుడు, కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, మురళీ, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అయ్యప్పనగర్‌లో..

పట్టణంలోని అయ్యప్పనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వారదర్శనం ద్వారా స్వామిని భక్తులు దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గీతామందిరంలో..

పట్టణంలోని గీతామందిరంలో ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, స్వామివారి ద్వార దర్శనం, గోపూజ, గీతా పారాయణం, విష్ణు సహస్రనామ పూజ, బంగారు పూలతో స్వామికి అష్టోత్తరం, మంత్రపుష్పం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా సున్నా బ్రదర్స్ వ్యవహరించారు.

ఘనంగా..

మనుబోలు : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. మనుబోలులోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయంలో అర్చకుడు హనుమామార్యులు వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. సుప్రభాత సేవ, తిరుప్పావై నిర్వహించారు. పెద్ద సంఖ్యల భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామివారికి పూలంగి, గరుడ సేవలను గావించారు. ఆపై మంగళ వాయిద్యాల నడుమ గరుడ వాహనంపై కొలువైన విష్ణుమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే పడమటి వీధిలోని రామాలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ సీతారాములకు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులకు ఉత్తర ద్వారదర్శనం చేయించారు.

➡ భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా పెనుగొండ సుధాకర్, శాంతి, బండారు వెంకట సుధాకర్, సునీత దంపతులు వ్యవహరించారు.



మనుబోలు : ప్రత్యేకాలంకరణలో సీతారాములు



మనుబోలు : విష్ణుమూర్తి గ్రామోత్సవం

గరుడ వాహనంపై గ్రామోత్సవం

ముత్తుకూరు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో శనివారం విశేష పూజలు, గ్రామోత్సవాలతో పండగ వాతారణం సంతరించుకొంది. ఇందులో భాగంగా ఈపూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో వేకువజామున వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. కృష్ణపట్నం, ముత్తుకూరు, కప్పలదొరువు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు దైవ దర్శనానికి క్యూ కట్టారు.

భక్తిశ్రద్ధలతో..

ఇందుకూరుపేట : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మండల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందుకూరుపేటలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

కోదండరామస్వామి దేవస్థానంలో..

కోవూరు : మండల కేంద్రంలోని గాంధీపార్క్ సెంటర్‌లో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలను జరిపించారు. అనంతరం పూలంగిసేవ చేపట్టారు. ఉభయకర్తలుగా దండి శ్రీనివాసులు, మమత దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ ఈఓ దర్గయ్య పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి దేవస్థానంలో..

కోవూరులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో కోదండరామస్వామి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అర్చకుడు నాగరాజాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు జయప్రకాష్ స్వామి, సుబ్బయ్యస్వామి, నందకుమార్‌స్వామి పాల్గొన్నారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహన్యాస, నవావర్ణ పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం, గ్రామోత్సవం అత్యంత శోభాయమానంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో శ్రీకృష్ణుడు



పొదలకూరు : స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం



ఇందుకూరుపేట : లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం



కోవూరు : విశేషాలంకరణలో స్వామివారు



కోవూరు : వీరాంజనేయస్వామి దేవస్థానంలో..



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



ముత్తుకూరు : ఈపూరులో చెన్నకేశవుని గ్రామోత్సవం

డిగ్రీ విద్యార్థులకు అభినందన

వెంకటాచలం : కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు పూర్తి చేసిన డిగ్రీ విద్యార్థులను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి శనివారం అభినందించారు. బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ అందించిన లెర్నింగ్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో డిగ్రీ విద్యార్థులు పాఠశాల చిన్నారులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ టెక్నిక్స్‌ను నేర్పించి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ విద్యార్థులకు కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో వీసీ సుందరవల్లి బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ అందించిన సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ ఎ.జ్యోత్స్న పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న వీఎస్‌యూ వీసీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎంపీపీ ఉప్పల స్వర్ణలత

తోటపల్లిగూడూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ క్రమంలో తాగునీరు, పారిశుద్ధ్యం, గృహనిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పథకం తీరుతెన్నులపై అధికారులు చర్చించారు. అలాగే జగనన్న సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా పరిష్కారం అవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ లావణ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, ఇతర మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అధికారులు

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుత్ దీపాల వెలుగులో సెంటినరి బాప్టిస్టు చర్చి

• 130 ఏళ్ల సెంటినరి బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న 130 ఏళ్ల నాటి సెంటినరి బాప్టిస్టు చర్చిలో ఆదివారం నుంచి క్రిస్మస్ వేడుకలు జరుగనున్నాయి. ఈ చర్చిని 1892లో ప్రారంభించారు. డేవిస్ దొర పాలనలో అమెరికా నుంచి నెరె విల్సన్ బృందం మత ప్రచారానికి ఈ ప్రాంతానికి వచ్చిందని, గ్రామానికి చెందిన మోడెం రామిరెడ్డి ఆ బృంద బోధనల ప్రభావానికి ఆకర్షితులై క్రైస్తవ మతాన్ని స్వీకరించారని పెద్దలు చెబుతారు. అప్పట్లో రామిరెడ్డి ఉంటున్న నివాస స్థలాన్ని ఈ చర్చికి విరాళంగా ఇచ్చి గ్రామాన్ని వదలి మత ప్రచారానికి వెళ్లారని చెబుతుంటారు. ఆ తరువాత క్రైస్తవ భక్తులు ఆ స్థలంలో సెంటినరి బాప్టిస్టు చర్చిని నిర్మించి అభివృద్ధి చేశారు. అప్పట్నుంచీ ఈ చర్చిని మూడు పర్యాయాలు పునర్నిర్మించారు. అయితే తొలుత నిర్మించిన చర్చి ఆకారంలోనే పునర్ నిర్మిస్తూ వస్తుండడం గమనార్హం. చర్చి ప్రారంభం నుంచి ప్రతి ఏడాది తొమ్మిది రోజుల పాటు అత్యంత వేడుకగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది క్రిస్మస్ వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని చర్చి పాస్టర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌నాథ్ తెలిపారు. వేడుకల ప్రారంభం సందర్భంగా ఆదివారం సండే స్కూలు పిల్లలతో 'క్రీస్తు పుట్టుక' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 1వ తేదీ వరకు ప్రతిరోజూ చర్చిలో ప్రార్థనలు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు. క్రైస్తవ భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు వరిగొండకు మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడి మండలంలోని వరిగొండ పంచాయతీకి ఆదివారం విచ్చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వరిగొండ పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మంత్రి పాల్గొంటారన్నారు.

మండల యూత్ అధ్యక్షుల నియామకం

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐదు మండలాలకు వైఎస్సార్‌సీపీ మండల యూత్ విభాగ అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పొదలకూరుకు బొర్రా సంతోష్‌రెడ్డి, మనుబోలుకు జెట్టి సురేంద్రరెడ్డి, ముత్తుకూరుకు దువ్వూరు కృష్ణతేజారెడ్డి, తోటపల్లిగూడూరుకు అడపాల అవినాష్‌రెడ్డి, వెంకటాచలానికి వడ్లమూడి నరేష్‌నాయుడులను నియమించారు.

అలగానిపాడు సర్పంచ్‌గా శేషయ్య

– బాధ్యతలు అప్పగించిన అధికారులు

విడవలూరు : మండలంలోని అలగానిపాడు ఉప సర్పంచ్‌గా ఉన్న శేషయ్యకు సర్పంచ్ బాధ్యతలను అధికారులు శనివారం అప్పగించారు. మరో రెండున్నరేళ్ల పాటు ఈయన సర్పంచ్‌గా కొనసాగుతారు. తొలి రెండున్నరేళ్ల పాటు సర్పంచ్‌గా గండవరపు వివేకానందరెడ్డి కొనసాగారు. గ్రామ ప్రజల ఆమోదం మేరకు ఐదేళ్ల కాలపరిమితిలో వీరు సర్పంచ్‌లుగా కొనసాగేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు శేషయ్యకు బాధ్యతలు అప్పగించారు.

సీఐకు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హైమారావును శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, దామరమడుగు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌కుమార్ కలిశారు. శాలువతో సన్మానించారు.

నేత్రదానం



కె.జయరామరాజు (ఫైల్)

నెల్లూరు సిటీ : బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కూరపాటి జయరామరాజు (70) శుక్రవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల(కార్నియా)ను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ బి.లాలేష్ శనివారం సేకరించారు.

స్నేహపూరిత వాతావరణంలో క్రీడా పోటీలు

కోవూరు : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు స్నేహపూరిత వాతావరణంలో జరిగేలా గ్రౌండ్ ఇన్‌చార్జిలు, సచివాలయ కార్యదర్శులు, పీడీలు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సంబంధించి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం తొమ్మిది క్రీడా మైదానాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తొలిరోజు కబడ్డీ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు పోటీలు సాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రహీమ్, వై.చెంచులక్ష్మమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు రమణయ్య, మధుసూదన్‌రావు, దేవిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కనుపూరు కాలువ కింద 54,200 ఎకరాలకు సాగునీరు

పొదలకూరు : కనుపూరు కాలువ నుంచి పొదలకూరు, నెల్లూరు రూరల్, వెంకటాచలం, మనుబోలు మండలాలకు సాగునీటి విడుదల వివరాలను కాలువ డీఈ గురజాల వెల్లడించారు. సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. కాలువ జీరో పాయింట్ నుంచి 6.160 కి.మీ వద్ద ఉన్న పొదలకూరు మండలం వెలికంటిపాళెంలోని 250 ఎకరాలకు 4.17, తాటిపర్తిలోని 2055 ఎకరాలకు 34.25 క్యూసెక్కులు అందించనున్నారు. నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులోని 1,350 ఎకరాలకు 22.50, సజ్జాపురంలోని 500 ఎకరాలకు 7.50, వెల్లంటిలోని 1950 ఎకరాలకు 32.50, కందమూరులోని 830 ఎకరాలకు 13.83, సౌత్‌మోపూరులోని 4520 ఎకరాలకు 75.33, ములుముడిలోని 935 ఎకరాలకు 15.58 క్యూసెక్కుల వంతున అందించనున్నారు. నెల్లూరురూరల్, వెంకటాచలం మండలాల్లోని గ్రామాలకు 37.400 కి.మీ వద్ద ఉన్న తిక్కవరప్పాడు బ్రాంచ్ కాలువ ద్వారా దొంతాలి, చెముడుగుంట, బురాన్‌పూర్, కాకుటూరు, కంటేపల్లి, వెంకటాచలం, తిక్కరప్పాడు, సర్వేపల్లి తదితర గ్రామాల్లోని 22,200 ఎకరాలకు 935 క్యూసెక్కులు, కందపాడులోని 350 ఎకరాలకు 5.83 క్యూసెక్కులు, 43 కి.మీ వద్ద ఉన్న కొమ్మలపూడి బ్రాంచ్ కాలువ ద్వారా వడ్డిపాళెం, కనుపూరు, చవటపాళెం, కొమ్మలపూడి గ్రామాల్లోని 5,300 ఎకరాలకు 75.71 క్యూసెక్కులు, కసుమూరులోని 1490 ఎకరాలకు 24.83 క్యూసెక్కులు, 48 కి.మీ వద్ద ఉన్న ముద్దముడి బ్రాంచ్ కాలువ ద్వారా కురిచెర్లపాడు, శ్రీరామపురం, చెరుకుముడి, ముద్దముడి గ్రామాల్లోని 4,800 ఎకరాలకు 80 క్యూసెక్కులు, వడ్లపూడిలోని 1,620 ఎకరాలకు 27 క్యూసెక్కులు అందించనున్నారు. 55 కి.మీ వద్ద ఉన్న బండేపల్లి బ్రాంచ్ కాలువ ద్వారా మనుబోలు మండలంలోని గొట్లపాళెం, వీరంపల్లి, అక్కెంపేట, కొండుపాళెం, మడమనూరు, బండేపల్లి, జట్లకొండూరు 6,100 ఎకరాలకు 101.67 క్యూసెక్కులు సాగునీరు అందించనున్నారు. కనుపూరు కాలువ రిజిస్టర్ ఆయకట్టు 66వేల ఎకరాలు కాగా ప్రతిపాదిత 54,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



కనుపూరు కాలువ

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం



నెల్లూరురూరల్ : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



నెల్లూరు(బారకాసు) : నగరంలో చేపట్టిన బైక్ ర్యాలీ

నెల్లూరురూరల్ : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను విజయవంతం చేద్దామని మండలస్థాయి అధికారులు పిలుపునిచ్చారు. రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని క్రీడాకారులను పోటీల్లో పాల్గొనేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంపీపీ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జిల్లాలో ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలో సైకిల్, బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ క్రీడా మైదానం నుంచి ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన ర్యాలీలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.